సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం
సోమవారం : 30 : జనవరి : 2023



ఉత్సాహం.. ఉద్వేగం

సాక్షి మీడియా ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఎస్‌పీఎల్ క్రికెట్ టోర్నమెంట్ ఉత్సాహంగా కొనసాగుతోంది. 8లో



నేడు సింగరేణి డైరెక్టర్ల ఎంపిక

సింగరేణి ఆపరేషన్స్, ప్రాజెక్ట్స్ అండ్ ప్లానింగ్ డైరెక్టర్లను నేడు ఎంపిక చేయనుండగా, 10 మంది అధికారులు పోటీ పడుతున్నారు. 10లో

గరిష్టం / కనిష్టం
33° / 18°

వాతావరణం

జిల్లాలో సోమవారం సాధారణ ఉష్ణోగ్రతలే నమోదవుతాయి. రాత్రి వేళ చలి ప్రభావం ఉంటుంది.

న్యూస్‌రీల్

శ్రీకనకదుర్గమ్మతల్లికి విశేష పూజలు



అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

పాల్వంచరూరల్: శ్రీకనకదుర్గమ్మ తల్లికి ఆదివారం అర్చకులు విశేష పూజలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో తరలిరావడంతో ఆలయ ప్రాంగణం కిటకిటలాడింది. ఉదయం నుంచి సాయంత్రం వరకు క్యూలైన్ ద్వారా వెళ్లి అమ్మవారిని దర్శించుకుని పూజలు జరిపారు. తలనీలాలు సమర్పించారు. ఒడిబియ్యం, చీరలు, కుంకుమ, పసుపు, గాజులు అమ్మవారికి సమర్పించి మొక్కులు చెల్లించారు. అర్చకులు అమ్మవారికి అభిషేకం నిర్వహించారు.

నేడు ప్రజావాణి

సూపర్‌బజార్(కొత్తగూడెం): ప్రజాసమస్యల పరిష్కారం కోసం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని సోమవారం ఉదయం 10.30 గంటలకు కలెక్టరేట్‌లో నిర్వహిస్తున్నట్లు జిల్లా రెవెన్యూ అధికారి(డీఆర్‌ఓ) అశోకచక్రవర్తి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు తమ ఫిర్యాదులను లిఖిత పూర్వకంగా అందజేయాలని సూచించారు. వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు సకాలంలో హాజరుకావాలని కోరారు.

కిన్నెరసానిలో పర్యాటకుల సందడి



కిన్నెరసానిలో బోటు షికారు చేస్తున్న పర్యాటకులు

పాల్వంచరూరల్ : మండలంలోని కిన్నెరసానికి ఆదివారం పర్యాటకులు భారీగా తరలివచ్చారు. దీంతో ప్రాజెక్టు పరిసరాలు కోలాహలంగా మారాయి. డీర్ పార్కులోని దుప్పులను, డ్యామ్‌పైనుంచి జలాశయాన్ని వీక్షించిన పర్యాటకులు.. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆనందోత్సాహాల నడుమ గడిపారు. 505 మంది పర్యాటకులు తరలి రావడంతో వైల్డ్‌లైఫ్ శాఖకు రూ.18,365 ఆదాయం, 300 మంది బోటు షికారు చేయడం ద్వారా టూరిజం కార్పొరేషన్‌కు రూ.14,960 ఆదాయం లభించినట్లు నిర్వాహకులు తెలిపారు.

రూ.120 కోట్లతో కొత్త భవనాలు..



కొనసాగుతున్న మెడికల్ కళాశాల అదనపు భవనాల నిర్మాణ పనులు

చురుగ్గా మెడికల్ కళాశాల విస్తరణ పనులు

- నిర్మాణాల పూర్తికి 15 నెలల గడువు
- పర్యవేక్షిస్తున్న ఆర్‌అండ్‌బీ అధికారులు

చుంచుపల్లి: కొత్తగూడెం మెడికల్ కళాశాల విస్తరణ పనులు చురుగ్గా సాగుతున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం 2021లో జిల్లాకు మెడికల్ కళాశాలను మంజూరు చేయగా, కొత్తగూడెం కేఎస్ఎం మైనింగ్ కళాశాల ఆవరణలో దాదాపు 30 ఎకరాల విస్తీర్ణంలో ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. మెడికల్ కళాశాల ప్రారంభం సందర్భంగా ఐదెకరాల విస్తీర్ణంలో రెండంతస్తుల భవన సముదాయాలను నిర్మించారు. ఇందుకోసం దాదాపు రూ.130 కోట్ల మేర ఖర్చు చేశారు. గతేడాది నవంబర్ 15న తొలి సంవత్సరంలో చేరిన విద్యార్థులకు తరగతులను లాంఛనంగా ప్రారంభించారు. ప్రస్తుతం మొదటి సంవత్సరంలో 149 మంది విద్యార్థులకు విద్యాబోధన సాగిస్తున్నారు. ఇక్కడ వైద్య విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులకు తాత్కాలికంగా రెండు వేర్వేరు హాస్టళ్లను అద్దె భవనాల్లో ఏర్పాటు చేశారు. ఇక గడిచిన నెలరోజులుగా మెడికల్ కళాశాలకు అనుసంధానంగా మరికొన్ని కొత్త భవన నిర్మాణాలు చేపట్టారు. మెడికల్ కళాశాల విద్యార్థులకు కావల్సిన హాస్టల్ భవనాలతో పాటు తరగతుల నిర్వహణకు మరొక బిల్డింగ్ కోసం నిర్మాణ పనులను ప్రారంభించారు. డైనింగ్ హాలు, వంట గదులు, గెస్ట్ హౌస్ వంటి వాటి నిర్మాణాలను కూడా చేపడుతున్నారు. మెడికల్ కళాశాల విస్తరణ నిర్మాణ పనులను ప్రముఖ సంస్థకు అప్పజెప్పగా, రోడ్లు భవనాల శాఖ అధికారులు పర్యవేక్షిస్తున్నారు. నెల రోజులుగా పునాదుల తవ్వకాలు, కాంక్రీట్ పనులు వేగంగా సాగుతున్నాయి. కొత్త భవనాలు అందుబాటులోకి వస్తే విద్యార్థులకు కళాశాలతోపాటు వసతి సౌకర్యం కూడా ఒకే ప్రాంగణంలో ఉంటుంది. మెడికల్ కళాశాలలో పనిచేస్తున్న బోధన సిబ్బందికి సైతం ఇక్కడే వసతి కల్పిస్తారు.

గడువు 15 నెలలు..

రూ.120 కోట్ల నిధులతో కొత్తగూడెం మెడికల్ కళాశాల విస్తరణ పనులను ప్రారంభించారు. మెడికల్ కళాశాలలో తరగతి గదులతో పాటు విద్యార్థిని, విద్యార్థులకు వేర్వేరుగా రెండు ప్రత్యేక హాస్టల్ భవనాలను నిర్మిస్తారు. ఇందులో బాలుర కోసం జీ–ప్లస్ 4, బాలికల కోసం జీ ప్లస్–5 భవనాలను ఏర్పాటు చేస్తున్నారు. మెడికల్ కళాశాల కోసం ప్రత్యేకంగా జీ ప్లస్–టూ భవనాన్ని నిర్మిస్తున్నారు. షెడ్యూల్ ప్రకారం ఈ భవన నిర్మాణాలను 15 నెలల్లో సంబంధిత కాంట్రాక్టర్ పూర్తి చేయాల్సి ఉంది. దాదాపు వచ్చే ఏడాది మార్చిలోపు మెడికల్ కళాశాల, హాస్టల్ భవనాలు అందుబాటులోకి రానున్నాయి. ప్రస్తుతం బాలికల హాస్టల్‌ను పాల్వంచలో ఏర్పాటు చేయగా, బాలురకు కేఎస్ఎం సమీపంలోని అద్దె భవనంలో నిర్వహిస్తున్నారు. ప్రస్తుతం హాస్టల్ నుంచి విద్యార్థులు వారే చార్జీలు పెట్టుకుని వస్తున్నారు. అధికారులు వీరి కోసం హాస్టళ్ల నుంచి కళాశాల వరకు ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేయాల్సి ఉండగా ఇంతవరకు సమకూర్చలేదు. ప్రస్తుతం మొదటి సంవత్సరం 149 మంది విద్యార్థులకు అనాటమీ, ఫిజియాలజీ, బయోకెమిస్ట్రీ సబ్జెక్టుల్లో కామన్ సిలబస్‌ను బోధిస్తున్నారు.

పారదర్శకంగా బదిలీలు..

డీఈఓ సోమశేఖర శర్మ



అధికారులతో మాట్లాడుతున్న డీఈఓ సోమశేఖరశర్మ

కొత్తగూడెంఅర్బన్: పారదర్శకంగా ఉపాధ్యాయుల ప్రమోషన్, బదిలీల జాబితా తయారు చేసేందుకు కసరత్తు చేస్తున్నట్లు జిల్లా విద్యాశాఖాధికారి ఇ.సోమశేఖరశర్మ తెలిపారు. ఆదివారం డీఈఓ కార్యాలయంలో జరుగుతున్న ప్రక్రియను ఆయన పరిశీలించి మాట్లాడారు. పూర్తి పారదర్శకతతో డ్రాఫ్ట్, సీనియారిటీ జాబితాలు తయారు చేసి, ఉపాధ్యాయులకు అందుబాటులో ఉంచామని, అభ్యంతరాలు కోరామని వివరించారు. రాష్ట్ర స్థాయి అధికారుల నుంచి వచ్చిన సమాచారం ప్రకారం ఉపాధ్యాయులు ఆన్‌లైన్‌లో హెచ్‌ఆర్ఎంఎస్ డేటాలో నమోదు చేసుకున్న వివరాల ప్రకారం, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు, మండల విద్యాధికారులు ధ్రువపరిచిన సమాచారం ఆధారంగా జాబితా తయారు చేశామని తెలిపారు. కొందరు ఉపాధ్యాయులు వారి మొదటి నియామకం మేనేజ్‌మెంట్ లోకల్ బాడీకి బదులుగా గవర్నమెంట్ అని తప్పుగా నమోదు చేసుకున్నారని, దీని వల్ల వారి పేర్లు గవర్నమెంట్ మేనేజ్‌మెంట్ జాబితాలో వచ్చాయని తెలిపారు. అటువంటి వాటిని గుర్తించేందుకు అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులు, మండల విద్యాధికారులతో టీమ్‌లను ఏర్పాటు చేసి ప్రతి ఉపాధ్యాయుని వివరాలు వారి సర్వీస్ రిజిస్టర్లతో సరిపోల్చుతామని పేర్కొన్నారు. గుర్తించిన తేడాలను సరి చేసి రెండో డ్రాఫ్ట్ జాబితాను రెండు రోజుల్లో విడుదల చేస్తామన్నారు. తదుపరి అభ్యంతరాలు స్వీకరించి తుది జాబితా రూపొందించి కలెక్టర్ అధ్యక్షతన ఏర్పాటైన జిల్లా కమిటీ అనుమతికి నివేదిస్తామని వివరించారు. ఏ ఒక్క ఉపాధ్యాయుడికీ అన్యాయం జరగదని, ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని తెలిపారు. తప్పుడు సమాచారం ఇచ్చిన ఉపాధ్యాయులకు, దానిని ధ్రువీకరించిన అధికారులకు షోకాజ్ నోటీసులు జారీ చేస్తున్నట్లు పేర్కొన్నారు.

దరఖాస్తు గడువు పెంచేనా?

ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయుల ప్రమోషన్లు, బదిలీల ప్రక్రియకు సంబంధించి సోమవారం దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమం కొనసాగనుంది. దరఖాస్తుల స్వీకరణ చివరి రోజు కొత్తగూడెంలోని పాత డీఈఓ కార్యాలయంలో జరగనుందని జిల్లా విద్యాశాఖాధికారులు వివరించారు. అయితే దరఖాస్తుల స్వీకరణకు ఇంకా గడువు పెంచుతారా? లేక షెడ్యూల్ ప్రకారమే జరుగుతుందో వేచి చూడాల్సి ఉంది. షెడ్యూల్ ప్రకారం అయితే 30న దరఖాస్తుల స్వీకరణ, 31 హార్డ్ కాపీల సమర్పణ, ఫిబ్రవరి 3న వెరిఫికేషన్ ప్రక్రియ, 7న ప్రొవిజినల్ సీనియారిటీ లిస్టుల ప్రకటన, 8న అభ్యంతరాల పరిశీలన, పరిష్కారం, 11న వెబ్‌సైట్‌లో తుది జాబితా ప్రకటన.. ఇలా మార్చి 4వ తేదీ వరకు ఉపాధ్యాయుల ప్రమోషన్, బదిలీల ప్రక్రియ పూర్తికానుంది. సోమవారం జిల్లాలోని బయాలజీ, సోషల్ ఉపాధ్యాయులు దరఖాస్తు చేసుకోనున్నారు. వెరిఫికేషన్ ప్రక్రియ కూడా కొనసాగనుంది.



పార్కులో ఏర్పాటు చేసిన ఫౌంటెన్

మురికి కూపం.. ఇప్పుడు మురిపెం !

ఆహ్లాదపరిచే ఈ ఫౌంటెన్, స్కేటింగ్ రింక్, చెస్ బోర్డు ఎక్కడని ఆలోచిస్తున్నారా.. ఈ పార్కును చూడాలంటే ఏదో సుదూర పర్యాటక ప్రాంతానికి వెళ్లాల్సిన పనిలేదు. మన ఖమ్మంలోనే ఈ పార్కు రూపుదిద్దుకుంది. కొన్నేళ్ల క్రితం మురికి కూపంలా, దుర్వాసన వెదజల్లే గోళ్లపాడు చానల్‌ను ఆధునికీకరించి.. అండర్‌గ్రౌండ్ డ్రెయినేజీ నిర్మించాక పైన పలువురు ప్రముఖుల పేర్లతో పార్కులు నిర్మించారు. ఇందులో ప్రొఫెసర్ జయశంకర్ పార్కులో పరిశీలిస్తే... ఫౌంటెన్, స్కేటింగ్ రింక్, బాస్కెట్‌బాల్ కోర్టు, చెస్ బోర్డు, పంచతత్వ పార్కులు ఇలా అన్నీ కొలువుదీరాయి. త్వరలోనే ఈ పార్కును ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

– స్టాఫ్ ఫొటోగ్రాఫర్



చెస్ ఆడుకునేందుకు ఏర్పాటు చేసిన బోర్డు



స్కేటింగ్ రింక్

కొత్త డీఈఓగా ప్రసాద్

కొత్తగూడెంఅర్బన్: జిల్లా విద్యాధికారిగా ఎస్ఎస్ఎస్.ప్రసాద్‌ను నియమిస్తూ స్కూల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ ఏ.దేవసేన ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. గత 24వ తేదీన కె.రవికాంతరావును నియమిస్తూ విద్యాశాఖ ఉత్తర్వులు జారీ చేసింది. కానీ రవికాంతరావు వివిధ కారణాలతో డీఈఓగా విధుల్లో చేరలేదు. మరోవైపు ప్రస్తుతం ఉపాధ్యాయుల ప్రమోషన్లు, బదిలీల ప్రక్రియ కొనసాగుతోంది. ఈ నేపథ్యంలో రెగ్యులర్ డీఈఓ అవసరమున్నందున ప్రసాద్‌ను నియమిస్తూ స్కూల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. హైదరాబాద్‌లో మోడల్ స్కూల్స్ డైరెక్టర్‌గా పనిచేస్తున్న ఎస్ఎస్ఎస్.ప్రసాద్ ఇక్కడికి డీఈఓగా రానున్నారు.

5న డ్రిల్ ఆపరేటర్ రాత పరీక్ష



సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి సంస్థలో ఖాళీగా ఉన్న 24 డ్రిల్ ఆపరేటర్ ట్రైనీ కేటగిరీ–1(ఇంటర్నల్) పోస్టులకు వచ్చే నెల 5న రాత పరీక్ష నిర్వహించనున్నారు. గత జూలైలో యాజమాన్యం నోటిఫికేషన్ ఇవ్వగా సుమారు 4,800 మంది కార్మికులు దరఖాస్తు చేసుకున్నారు. దరఖాస్తులను స్క్రూటినీ చేసిన యాజమాన్యం సుమారు 3,498 మందిని అర్హులుగా తేల్చి హాల్ టికెట్లు ఇచ్చే ప్రక్రియ ప్రారంభించింది.

ప్రతీ ఎకరాకు సాగునీరు..



మారెళ్లపాడు ఎత్తిపోతల పథకానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే రేగా, అధికారులు, ప్రజాప్రతినిధులు

- ప్రభుత్వ విప్, పినపాక ఎమ్మెల్యే రేగా కాంతారావు
- మారెళ్లపాడు ఎత్తిపోతల పథకానికి శంకుస్థాపన

అశ్వాపురం: పినపాక నియోజకవర్గంలో ప్రతీ ఎకరాకు సాగు నీరందించేందుకు కృషి చేస్తానని ప్రభుత్వ విప్, పినపాక ఎమ్మెల్యే రేగా కాంతారావు అన్నారు. సీతారామ ఎత్తిపోతల పథకంలో భాగంగా అశ్వాపురం మండలంలో అదనపు ఆయకట్టు 17 వేల ఎకరాలకు సాగునీరు అందించేలా రూ.25 కోట్లతో నిర్మిస్తున్న మారెళ్లపాడు ఎత్తిపోతల పథకం పనులకు మండల పరిధిలోని బీజీకొత్తూరు గ్రామంలో ఆదివారం ఆయన శంకుస్థాపన చేసి భూమి పూజ చేశారు. అనంతరం బీజీ కొత్తూరు గ్రామంలోని సీతారామ ప్రాజెక్ట్ మొదటి పంప్‌హౌస్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా రేగా మాట్లాడుతూ సీఎం కేసీఆర్ ఆశీస్సులతో అదనపు ఆయకట్టు కోసం రూ.25 కోట్లతో మారెళ్లపాడు ఎత్తిపోతల పథకం ద్వారా అశ్వాపురం మండలంలో 17 వేల ఎకరాలకు సాగునీరు అందించే పనులు ప్రారంభించడం సంతోకరమన్నారు. ఏడాది కాలంలో పథకం పనులు పూర్తవుతాయని చెప్పారు. రూ.వందల కోట్లతో పినపాక నియోజకవర్గంలో బీటీరోడ్లు, వాగులపై వంతెనలు, రహదారుల నిర్మాణాలు తదితర అభివృద్ధి పనులు చేపట్టినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జలవనరులశాఖ ఈఈ వెంకటేశ్వరరావు, డీఈ శ్రీనివాస్, మేఘా ఇంజనీరింగ్ సంస్థ జీఎం కేశవ్‌స్వామి, జెడ్పీటీసీ సభ్యురాలు సూదిరెడ్డి సులక్షణ, రైతుబంధు సమితి మండల అధ్యక్షుడు గజ్జల లక్ష్మారెడ్డి, సీఐ శ్రీనివాసరావు, ఎస్‌ఐలు జితేందర్, నాగుల్‌మీరా, తహసీల్దార్ సురేష్‌కుమార్, ఎంపీడీఓ వరప్రసాద్, ఎంపీఓ శ్రీనివాస్, ఏఓ సాయిశంతన్‌కుమార్, వైస్ ఎంపీపీ వీరభద్రం, మాజీ ఎంపీపీ కొల్లు మల్లారెడ్డి, సర్పంచ్‌లు మర్రి మల్లారెడ్డి, చాప ఉమాదేవి, బండ్ల సంధ్యారాణి, మడకం సాధు, కలేటి నరసింహారావు, పర్శిక సూరిబాబు, పాయం భద్రయ్య, పర్శిక రాజమ్మ, సున్నం రాంబాబు, కాక అశోక్, గొర్రెముచ్చు వెంకటరమణ, ఎంపీటీసీలు కందుల దుర్గాభవాని, తాటి పూజిత, ఉపసర్పంచ్ మేడవరపు సుధీర్, నెల్లిపాక పీఏసీఎస్ ఉపాధ్యక్షుడు కమటం సురేష్, డైరెక్టర్లు సందీప్, రామకృష్ణ, అధికారులు, ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

ముగిసిన వాగ్గేయకారోత్సవాలు

- ఐదురోజులపాటు భక్తులను అలరించిన వేడుకలు
- రామయ్యకు అభిషేకం, సువర్ణ పుష్పార్చన



కల్యాణం నిర్వహిస్తున్న అర్చకుడు

భద్రాచలం: శ్రీ సీతారామ చంద్రస్వామి దేవస్థానంలో ఐదు రోజులుగా జరుగుతున్న భక్త రామదాసు జయంతి ఉత్సవాలు ఆదివారంతో విజయవంతంగా ముగిశాయి. శ్రీ సీతారామ చంద్రస్వామి దేవస్థానం, చక్ర సిమెంట్స్ వారి నేంద్రగంటి అలివేలు మంగ సర్వయ్య చారిటబుల్ ట్రస్ట్, నాదసుధా తరంగిణి కల్చరల్ ట్రస్ట్, నామగాన లహరి కల్చరల్ ట్రస్టు ఆధ్వర్యంలో జరిగిన వాగ్గేయకారోత్సవాలు భక్తులను, సంగీతాభిమానులను అలరించాయి. చివరి రోజైన ఆదివారం హైదరాబాద్‌కు చెందిన వంశీకృష్ణ, విద్య, మోహన కృష్ణ బృందం చేసిన శాస్త్రీయ సంగీత కార్యక్రమాలు భక్తులను ఓలలాడించాయి. అనంతరం సంగీత కళాకారులను శాలువాలతో సత్కరించారు.

ఘనంగా అభిషేకం, సువర్ణ పుష్పార్చన

దేవస్థానంలో మూలమూర్తులకు ఆదివారం అభిషేకం, సువర్ణ పుష్పార్చన జరిపారు. తొలుత తెల్లవారుజామున గర్భగుడిలో స్వామి వారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం నిత్యకల్యాణానికి బేడా మండపంలో కొలువుదీరిన స్వామి వారికి విశ్వక్సేన పూజ, పుణ్యాహవాచనం చేశారు. స్వామి వారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని ఆలయ అర్చకులు శాస్త్రోక్తంగా జరిపారు.

నేటి నుంచి స్పర్శ్ ఉద్యమం..

నేడు జాతీయ కుష్ఠు నివారణ దినోత్సవం

- వచ్చే నెల 13వరకు అవగాహన సదస్సులు, ర్యాలీలు
- వ్యాధి నిర్మూలనకు వైద్య, ఆరోగ్య శాఖ పటిష్ట చర్యలు



స్పర్శ్ అవగాహన ఉద్యమ ప్రచార బ్యానర్ విడుదల చేస్తున్న అధికారులు

పాల్వంచరూరల్: జిల్లాలో కుష్ఠు వ్యాధి చాపకింద నీరులా విస్తరిస్తోంది. ఒకరు నుంచి మరొకరికి వ్యాప్తిచెందే అంటువ్యాధి కావడంతో ఆందోళనకు గురిచేస్తోంది. తగిన సమయంలో చికిత్స పొందకుంటే వ్యాధి మరింత విస్తరించే ప్రమాదం ఉంది. నిరక్షరాస్యత, అవగాహనలోపం కారణంగా ఈ వ్యాధి ఎక్కువగా ప్రబలుతోందని వైద్యులు చెబుతున్నారు. వ్యాధి నిర్మూలన కోసం వైద్య, ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో గ్రామాల్లో, పట్టణాల్లో ఈ నెల 30 నుంచి ఫిబ్రవరి 13 వరకు స్పర్శ్ అవగాహన ఉద్యమం చేపట్టనున్నారు. సదస్సులు, ర్యాలీలు నిర్వహించి ప్రజలను జాగృతం చేయనున్నారు. ఈ ఉద్యమంలో ప్రజలు, ప్రజాప్రతినిధులు కూడా భాగస్వామ్యం కావాలని వైద్యాధికారులు కోరుతున్నారు. అన్ని ప్రాథమిక ఆరోగ్యకేంద్రాల్లో ఉచితంగా వైద్యపరీక్షలు నిర్వహిస్తున్నారు. ప్రారంభంలోనే గుర్తించి చికిత్స తీసుకోకపోతే అంగవైకల్యం బారిన పడే అవకాశం ఉందని సూచిస్తున్నారు.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రత్యేక శ్రద్ధ..

జిల్లాలో పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో ఈ వ్యాధి వ్యాప్తి చెందుతోందని జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ తాజా సర్వే గణాంకాలు చెబుతున్నాయి. ఈ వ్యాధి నివారణకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేకంగా నిధులు కేటాయించి నివారణ చర్యలు తీసుకోవడంతో ఆశించినస్థాయిలో సత్ఫలితాలు కన్పిస్తున్నాయి. జిల్లా వ్యాప్తంగా జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ, కుష్ఠు వ్యాధి నిర్మూలనశాఖ సంయుక్తంగా సర్వే నిర్వహించాయి. గత ఏడాది 46 కేసులు ఉండగా, ఇటీవల నిర్వహించే సర్వేలో మరో 27 కేసులు తేలాయి. జిల్లాలో ఆరేళ్లలో బాధితుల సంఖ్య 342కు చేరింది. వ్యాధిపై సరైన అవగాహన లేకపోవడం, ఒక వేళ తెలిసినా బయటకు చెబితే సామాజిక వివక్షకు గురవుతామనే భయంతో ఆస్పత్రులకు వచ్చి చికిత్స పొందలేకపోతున్నారు. ఒకరి నుంచి మరొకరికి సోకుతుండటంతో అధికారులు గత ఏప్రిల్ నుంచి డిసెంబర్ వరకు ఇంటింటికి తిరిగి సర్వే చేపట్టారు. 1,443 ఆశా వర్కర్లు, 7 డీపీఎంఓలు, 222 మంది ఏఎన్ఎంలు, 186 సూపర్‌వైజర్ల సహాయంతో వివరాలు సేకరించారు. 2,53,479 ఇళ్లలో సర్వే చేసి 11,20,074 మందిని పరీక్షించారు. ఇందులో 6,775 అనుమానాస్పద కేసులను గుర్తించారు. పూర్తిస్థాయిలో పరీక్షించాక 27 కేసులు నిర్ధారణయ్యాయి. ఇప్పటికే గుర్తించి, చికిత్స పొందుతున్న 140 మందికి ఎంసీఆర్ చెప్పులు, సెల్ఫ్‌కేర్ కిట్లు పంపిణీ చేసినట్లు డీఎంహెచ్‌ఓ తెలిపారు.



బాధితుడికి మందులు పంపిణీ చేస్తున్న డీఎంహెచ్ఓ డాక్టర్ శిరీష

సర్వే వివరాలు ఇలా..

సిబ్బంది	:1443
పరిశీలించిన ఇళ్లు	:2,53,479
పరిశీలించిన వ్యక్తులు	:11,20,074
అనుమానాస్పద కేసులు	:6775
నిర్ధారణ జరిగినవి	:27

జిల్లాలో గత ఆరేళ్లుగా నమోదవుతున్న కేసులు..

ఏడాది	కేసుల సంఖ్య
2016-2017	60
2017-2018	62
2018-2019	68
2019-2020	94
2020-2021	36
2021-2022	31
2022-2023	27

చికిత్స పొందితే 12 నెలల్లో నయం..



ఈ వ్యాధి మైకో బ్యాక్టీరియా లెప్రీ వల్ల సంక్రమిస్తుంది. ముఖ్యంగా నరాలకు, చర్మానికి సోకుతుంది. వ్యాధి లక్షణాలు బహిర్గతం కావడానికి మూడేళ్లు పడుతుంది. వయసు, లింగభేదం లేకుండా ఎవరికైనా సోకవచ్చు. వంశపారంపర్యంగా సంక్రమించదు. ఈ వ్యాధి వచ్చిన వారికి మచ్చలు సహజపు చర్మపురంగు కంటే తక్కువగా లేదా రాగి రంగు కలిగి ఉంటాయి. మచ్చలపై స్పర్శ, నొప్పి ఉండదు. శరీరంలో ఏ ప్రదేశంలోనైనా సోకవచ్చు. వ్యాధి ప్రారంభ దశలో గుర్తించి ఎంబీపీ చికిత్స తీసుకుంటే అంగవైకల్యానికి దారితీయదు. చికిత్స పూర్తైన రోగుల్లో అంగవైకల్యం ఉంటే శస్త్రచికిత్స ద్వారా సరిచేయవచ్చు. వ్యాధి 6 నెలల నుంచి 12 నెలల్లో పూర్తిగా నయమవుతుంది. దీని నివారణ కోసం అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో మందులు అందుబాటులో ఉన్నాయి.

–డాక్టర్ శిరీష, జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి

అవగాహనలేక..

ఈ వ్యాధి నివారణకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేకంగా నిధులు, సిబ్బందిని కేటాయించి చర్యలు తీసుకుంటోంది. అయినప్పటికీ అవగాహనలేని వారు, బయటకు చెబితే చీదరించుకుంటారనే భావనతో కొందరు వ్యాధి ముదిరే వరకు చికిత్స కూడా తీసుకోవడం లేదు. దీంతో ఇతరులకు వ్యాపిస్తోంది. వ్యాధి లక్షణాలను ప్రారంభంలోనే గుర్తిస్తే వెంటనే నయం చేసుకునే అవకాశం ఉంది. ప్రధానంగా గ్రామీణ ఆవాస ప్రాంతాల్లో, తండాల్లో కేసులు పెరుగుతున్నట్లు వైద్యాధికారులు చెబుతున్నారు.

క్లుప్తంగా

గోదావరిలో వ్యక్తి గల్లంతు


శ్రీనివాసరావు (ఫైల్)

మణుగూరుటౌన్: మండలంలోని మల్లేపల్లిపార్కు గోదావరి తీరంలో వ్యక్తి గల్లంతైన ఘటన ఆదివారం చోటుచేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. సత్తుపల్లికి చెందిన సింహాద్రి శ్రీనివాసరావు (40) ఇటీవల పండుగకు మణుగూరు మండలంలోని కోటకట్ట ప్రాంతంలోని నర్సింహారావు ఇంటికి వచ్చాడు. మల్లేపల్లి పార్కు సమీపంలో గోదావరి తీరానికి స్నానానికి వెళ్లాడు. గోదావరిలో స్నానం చేసే క్రమంలో గల్లంతయ్యాడు. విషయం తెలిసిన వెంటనే మణుగూరు ఎస్ఐ రాజ్‌కుమార్ ఘటనా స్థలానికి వెళ్లి గాలింపు చర్యలు చేపట్టారు. సాయంత్రం వరకు గల్లంతైన వ్యక్తి ఆచూకీ తెలియలేదు. గజ ఈతగాళ్లతో పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం


గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

చర్ల: మండలంలోని ఆర్.కొత్తగూడెం గ్రామంలో ఆదివారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని స్థానికులు గుర్తించారు. స్థానికుల కథనం ప్రకారం.. ఆర్.కొత్తగూడెంలోని రామాలయం సెంటర్, కుర్నపల్లికి వెళ్లే మార్గంలో లైవ్ ఫిష్ షాపు వెనుక భాగంలో గుర్తు తెలియని మృతదేహం పడి ఉంది. లైవ్ ఫిష్ షాపునకు చెందిన వ్యక్తి చేపలు కట్ చేసి, వ్యర్థాలను వెనుక భాగంలో వేసేందుకు వెళ్లిన సందర్భంగా అక్కడ మృతదేహం పడి ఉండడాన్ని గుర్తించి చుట్టుపక్కల వారికి తెలిపాడు. వారు వెళ్లి చూసి చర్ల పోలీసులకు సమాచారం అందించారు. మృతదేహం ముక్కు భాగం నుంచి రక్తం కారి ఉంది. మృతుడు ఎరుపురంగు షర్టు, గళ్ల లుంగీ, తలపాగా ధరించి ఉన్నాడు.

కాంకేర్ జిల్లాలో ఎదురుకాల్పులు

చర్ల: ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని కాంకేర్ జిల్లాలో శనివారం రాత్రి జరిగిన ఎదురుకాల్పుల్లో మావోయిస్టులకు సంబంధించిన సామగ్రిని పెద్ద మొత్తంలో స్వాధీనం చేసుకున్నారు. వివరాలిలా ఉన్నాయి. కాంకేర్ జిల్లా కేంద్రానికి సుమారు 20 కిలోమీటర్ల దూరంలో గల అమ్బెడా సమీపంలోని ఉసేలీ అటవీ ప్రాంతంలో మావోయిస్టులు సమావేశమయ్యారనే సమాచారం మేరకు డీఆర్‌జీ బలగాలు శనివారం ఉదయం నుంచి కూంబింగ్ ఆపరేషన్‌ను చేపట్టాయి. ఈ క్రమంలో శనివారం రాత్రి ఉసేలీ అటవీ ప్రాంతంలో పోలీసులకు తారసపడిన మావోయిస్టులు పోలీసు బలగాలపై కాల్పులు జరిపినట్లు తెలుస్తుండగా పోలీసు బలగాలు సైతం ఎదురుకాల్పులకు దిగడంతో అరగంట పాటు హోరాహోరీగా ఇరువర్గాల మధ్య ఎదురుకాల్పులు జరిగినట్లు సమాచారం. తరువాత మావోయిస్టులు అక్కడి నుంచి తప్పించుకొనిపోయారు. ఆదివారం ఉదయం ఆ ప్రాంతంలో గాలించగా మావోయిస్టులకు సంబంధించిన నిత్యావసర వస్తువులు, వంట సామగ్రి, సోలార్ ప్యానెళ్లు, విప్లవ సాహిత్యానికి సంబంధించిన కరపత్రాలు, పుస్తకాలు లభ్యమయ్యాయి. తప్పించుకున్న మావోయిస్టుల కోసం అదనపు బలగాలను రంగంలోకి దింపి ఆదివారం ఉదయం నుంచి ఆ ప్రాంతంలో కూంబింగ్ ఆపరేషన్‌ను ముమ్మరం చేశారు.

బాలిక అదృశ్యం

దమ్మపేట: ఆశ్రమ పాఠశాల విద్యార్థిని అదృశ్యమైన ఘటన మండలంలోని అంకంపాలెం గ్రామంలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. మండలంలోని అంకంపాలెం ఆశ్రమ పాఠశాలలో పదో తరగతి చదువుతున్న విద్యార్థిని సంక్రాంతి సెలవుల అనంతరం ఈ నెల 24న ఆలస్యంగా పాఠశాలకు వచ్చింది. అదే రోజు రాత్రి సమయంలో ఆ విద్యార్థిని పాఠశాల నుంచి కనిపించకుండా పోయింది. విషయం దిబ్బగూడెం గ్రామానికి చెందిన విద్యార్థిని తల్లితండ్రులకు తెలిపామని ప్రిన్సిపాల్ తోలెం వెంకటేశ్వర్లు చెప్పారు. ప్రిన్సిపాల్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ శ్రావణ్‌కుమార్ తెలిపారు.

గ్రావెల్ టిప్పర్ పట్టివేత

కల్లూరు/కల్లూరురూరల్: కల్లూరు మండలంలోని బత్తులపల్లి గ్రామం నుంచి అక్రమంగా గ్రావెల్‌ను రవాణా చేస్తున్న టిప్పర్‌ను ఆదివారం రాత్రి రెవెన్యూ సిబ్బంది పట్టుకున్నారు. వివరాలిలా ఉన్నాయి. బత్తులపల్లిలో రైతుకు చెందిన భూమిలో ఎలాంటి అనుమతులు లేకుండా గ్రావెల్ తవ్వుతున్నారు. ఈ విషయంపై 'సాక్షి'దినపత్రికలో ఈ నెల 4న 'మా ఇష్టం.. మట్టి తవ్వకం'అనే శీర్షికన కథనం వెలువడింది. అప్పటి నుంచి రెవెన్యూ అధికారులు నిఘా పెట్టారు. తహసీల్దార్ బాబ్జిప్రసాద్ ఆదేశాల మేరకు వీఆర్ఏలు మాటు వేసి గ్రావెల్ టిప్పర్‌ను పట్టుకున్నారు. అనంతరం టిప్పర్‌ను కల్లూరు పోలీసులకు అప్పగించారు.

ఉత్సాహం .. ఉద్వేగం..

- రసవత్తరంగా సాగుతున్న ఎస్‌పీఎల్ క్రికెట్ టోర్నీ
- సెమీస్‌కు చేరిన శ్రీ చైతన్య జూనియర్ కళాశాల
- క్వార్టర్స్‌కు ప్రవేశించిన ఎస్‌బీఐటీ, అనుబోస్ డిప్లొమా జట్లు


రెండో మ్యాచ్‌లో విజయం సాధించిన కొత్తగూడెం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల జట్టు


సెమీ ఫైనల్స్‌కు చేరిన శ్రీచైతన్య జూనియర్ కళాశాల జట్టు


విజేతగా నిలిచిన ఖమ్మం రెజొనెన్స్ కళాశాల జట్టు

ఖమ్మం స్పోర్ట్స్: నగరంలోని ఎస్ఆర్అండ్‌బీ జీఎన్ఆర్ కళాశాల మైదానంలో జరుగుతున్న సాక్షి ప్రీమియర్ లీగ్ క్రికెట్ పోటీలు ఉత్సాహంగా.. ఉద్వేగంగా సాగుతున్నాయి. ఆదివారం రెండోరోజు క్వార్టర్ ఫైనల్ మ్యాచ్‌లో శ్రీచైతన్య జూనియర్ కళాశాల – వెలాసిటీ జూనియర్ కళాశాల జట్లు తలపడ్డాయి. ముందుగా బ్యాటింగ్ చేసిన శ్రీచైతన్య జూనియర్ కళాశాల జట్టు 74 పరుగులు చేయగా, తర్వాత బ్యాటింగ్ చేసిన వెలాసిటీ జూనియర్ కళాశాల జట్టు 52 పరుగులు మాత్రమే చేసి ఓడిపోయింది. దీంతో శ్రీచైతన్య జూనియర్ కళాశాల జట్టు 22 పరుగుల తేడాతో విజయం సాధించింది. కాగా ఇప్పటికే రెండు మ్యాచ్‌లు గెలిచిన ఎస్‌బీఐటీ డిప్లొమా కాలేజీ జట్టు తన ప్రత్యర్థి ఏఎస్ఆర్ జూనియర్ కళాశాలపై నెగ్గి క్వార్టర్ ఫైనల్స్‌కు ప్రవేశించింది. ముందుగా టాస్ గెలిచి బ్యాటింగ్ చేపట్టిన ఏఎస్ఆర్ జట్టు పరిమిత ఓవర్లకు 63 పరుగులు సాధించగా బ్యాట్స్‌మెన్ ముస్తఫా 19 పరుగులు చేశాడు. అనంతరం బ్యాటింగ్ చేసిన ఎస్‌బీఐటీ జట్టు సునాయాసంగా లక్ష్యం సాధించింది. దీంతో ఎస్‌బీఐటీ డిప్లొమా కాలేజీ జట్టు క్వార్టర్ ఫైనల్స్‌కు చేరింది. కిట్స్ డిప్లొమా కాలేజీ ఖమ్మం – అనుబోస్ డిప్లొమా కళాశాల పాల్వంచ జట్ల మ్యాచ్‌లో.. ముందుగా టాస్ గెలిచిన అనుబోస్ డిప్లొమా జట్టు ఫీల్డింగ్‌ను ఎంచుకుంది. దీంతో మొదట బ్యాటింగ్ చేసిన కిట్స్ జట్టు 78 పరుగులు సాధించింది. అనంతరం బ్యాటింగ్ చేసిన అనుబోస్ జట్టు 40 పరుగులు మాత్రమే చేసి ఓటమి పాలైంది. దీంతో కిట్స్ డిప్లొ మా కళాశాల జట్టు క్వార్టర్ ఫైనల్స్‌కు చేరుకుంది.

మొదటి రౌండ్‌లో బొమ్మ కాలేజీ విజయభేరి..

బొమ్మ డిప్లొమా కాలేజీ – వాణి ఐటీఐ ఖమ్మం జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో ముందుగా టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న వాణి ఐటీఐ జట్టు పరిమిత ఓవర్లలో 71 పరుగులు చేయగా, తర్వాత బ్యాటింగ్ చేసిన బొమ్మ డిప్లొమా కాలేజీ జట్టు 72 పరుగులు సాధించింది. రెండో మ్యాచ్‌లో ఆర్‌జేసీ జూనియర్ కళాశాల – ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల కొత్తగూడెం జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ ఎంచుకున్న ఆర్‌జేసీ జట్టు కేవలం 44 పరుగులు చేయగా.. తర్వాత బ్యాటింగ్ చేసిన ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల కొత్తగూడెం జట్టు ఘన విజయం సాధించింది. మరో మ్యాచ్‌లో కృష్ణవేణి జూనియర్ కళాశాల 2- వెలాసిటీ జూనియర్ కళాశాల ఖమ్మం జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన కృష్ణవేణి జట్టు 53 పరుగులు చేయగా అనంతరం బ్యాటింగ్ చేసిన వెలాసిటీ జూనియర్ కళాశాల జట్టు నాలుగు వికెట్ల నష్టంతోనే లక్ష్యం సాధించింది. మూడో మ్యాచ్‌లో రెజొనెన్స్ జూనియర్ కళాశాల (మెయిన్ క్యాంపస్) – ముదిగొండ జూనియర్ కళాశాల జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో ముందుగా టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న రెజొనెన్స్ జూనియర్ కళాశాల (మెయిన్ క్యాంపస్) నిర్ణీత ఓవర్లలో 7 వికెట్లు కోల్పోయి 64 పరుగులు సాధించింది. అనంతరం బ్యాటింగ్ చేసిన ముదిగొండ జూనియర్ కళాశాల జట్టు పరిమిత ఓవర్లకు 5 వికెట్ల నష్టానికి 55 పరుగులు చేసి ఓటమి పాలైంది. దీంతో రెజొనెన్స్ జూనియర్ కళాశాల జట్టు ఘన విజయం సాధించింది. జట్టు కెప్టెన్ రేవంత్ చక్కని ప్రతిభ కనబరిచాడు.

బీఆర్ఎస్‌లో అసంతృప్తి బహిర్గతం


మాట్లాడుతున్న ఎంపీపీ పార్వతి

చండ్రుగొండ: మండల బీఆర్ఎస్‌లో ఇంతకాలం నివురుకప్పిన నిప్పులా ఉన్న అసంతృప్తి ఒక్కసారిగా బహిర్గతమైంది. ఆ పార్టీ మండల మాజీ అధ్యక్షుడు భోజ్యానాయక్ అధ్యక్షతన ఆదివారం అయన్నపాలెం గ్రామంలోని లక్ష్యా గార్డెన్స్‌లో ప్రత్యేకంగా సమావేశం నిర్వహించారు. బీఆర్ఎస్ జెండా, ఫ్లెక్సీలు లేకుండానే సమావేశం ఏర్పాటు చేయడం గమనార్హం. ఎంపీపీ బానోత్ పార్వతి, రైతుబంధు జిల్లా సమన్వయకర్త అంకిరెడ్డి కృష్ణారెడ్డి, మండల సమన్వయకర్త గాదె లింగయ్య, గానుగపాడు సొసైటీ చైర్మన్ చెవుల చందర్‌రావు మాట్లాడుతూ ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు అనుసరిస్తున్న తీరు సరికాదని, అక్రమార్కులకు వత్తాసు పలుకుతున్నారని ఆరోపించారు. రైతుబంధు పథకం పార్టీలోని కొంతమందికి వరంగా మారిందని ఆక్షేపించారు. లక్షల రూపాయల వసూళ్లకు పాల్పడుతున్న అంశంపై ఎమ్మెల్యేతో పాటు పార్టీ జిల్లా, రాష్ట్ర కమిటీలకు ఫిర్యాదు చేసినా ఎలాంటి చర్యలు లేవన్నారు. ఎమ్మెల్యే మెచ్చా ఒంటెద్దు పోకడ కారణంగా పార్టీ భ్రష్టు పట్టిందని విమర్శించారు. అభివృద్ధి పనుల తోపాటు పథకాల కోసం లబ్ధిదారుల ఎంపిక లోనూ తమకు ఎలాంటి సమాచారం ఇవ్వడం లేదని ఎంపీపీ పార్వతి ఆవేదన చెందారు. తాడో పేడో తేల్చుకునే సమయం ఆసన్నమైందని భోజ్యానాయక్ ప్రకటించారు. కార్యకర్తల సమష్టి నిర్ణయమే శిరోధార్యమని రైతుబంధు జిల్లా సమన్వయకర్త కృష్ణారెడ్డి పేర్కొన్నారు.

పొంగులేటి వెంట నడుద్దాం..

ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావుపై అసంతృప్తితో ఏర్పాటు చేసిన సమావేశంలో ముఖ్యనాయకులు మాట్లాడుతుండగా కార్యకర్తలు నినాదాలు హోరెత్తాయి. జై పొంగులేటి .. జైజై పొంగులేటి అంటూ కార్యకర్తలు నినాదాలు చేశారు. శ్రీనన్న వెంటే నడుద్దామంటూ పెద్ద ఎత్తున సమావేశానికి వచ్చిన కార్యకర్తలు అభిప్రాయపడ్డారు. సమావేశంలో వైస్ ఎంపీపీ నరుకుళ్ల సత్యనారాయణ, ఎంపీటీసీ వెంకటకుమారి, సర్పంచ్‌లు సునీత, బాలాజీ, లక్ష్మీపతి పాల్గొన్నారు.

గిరిజన భవనం పరిశీలన

సాక్షి ఎఫెక్ట్..

ఖమ్మంమయూరిసెంటర్: నగరంలో నిర్మించిన గిరిజన భవనాన్ని గిరిజన సంక్షేమశాఖ అభివృద్ధి అధికారి కృష్ణానాయక్, ఏటీడీఓ నర్సింగ్ తిరుమల్‌రావు ఆదివారం సందర్శించారు. 'భవనం.. అలంకార ప్రాయమే'అను శీర్షికతో ఆదివారం సాక్షి దినపత్రికలో ప్రచురితమైన కథనానికి ఐటీడీఏ పీఓ, జిల్లా కలెక్టర్ స్పందించారు. వారి ఆదేశాలతో అధికారులు భవనాన్ని సందర్శించి, పలు ఏర్పాట్లకు శ్రీకారం చుట్టారు. ఇక నుంచి నిరంతరాయంగా ఉదయం ఒకరు, సాయంత్రం ఒకరు వాచ్‌మ్యాన్‌ను విధుల్లో ఉండేలా ఆదేశాలు జారీ చేశారు. గిరిజన భవనం మెయింటెనెన్స్ కోసం ఓ ఉద్యోగిని ఏర్పాటు చేశారు. ఇక నుంచి రోజూ సదరు ఉద్యోగి గిరిజన భవనంలోనే ఉంటూ భవన నిర్వహణను చూస్తూ, ఫంక్షన్లకు, సమావేశాలకు అద్దెకు ఇచ్చేలా చర్యలు తీసుకున్నారు.

కోడి పందేల పేరుతో భారీగా వసూళ్లు?


కోడి పందేలు నిర్వహించిన కన్నాయిగూడెం గ్రామం

అశ్వారావుపేటరూరల్: తెలంగాణ, ఏపీ సరిహద్దు ప్రాంతంలో కొద్ది రోజుల కిందట జరిగిన కోడి పందేల వ్యవహారం కొత్తమలుపు తిరుగుతోంది. ఈ పందేల నిర్వహణకు భారీగా నగదు చేతులు మారినట్లు ఆరోపణలు వస్తుండటంతో అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. వసూళ్ల వ్యవహారంపై పోలీసులు విచారణ సాగిసస్తుండటంతో పందెం నిర్వాహకులతోపాటు నగదు వసూళ్లకు పాల్పడిన వారిలో ఆందోళన మొదలైంది. అశ్వారావుపేట మండలంలోని మారుమూల అటవీ ప్రాంతంలోగల కన్నాయిగూడెం గ్రామ సమీపంలో ఈ నెల 27వ తేదీ ఉదయం కొందరు కోడి పందేలను బహిరంగంగానే నిర్వహించారు. గ్రామ సమీపంలో గల పంట పొలంలో కోడి పందేల నిర్వహణకు బరి సిద్ధం చేసి, నిర్వహణకు అనుమతులు ఉన్నట్లు ప్రచారం చేశారు. దాంతో పందెంరాయుళ్లు అశ్వారావుపేట మండలంలోని చుట్టు పక్కల గ్రామాలతోపాటు ఏపీలోని ఏలూరు జిల్లా బుట్టాయిగూడెం, జీలుగుమిల్లి మండలాల నుంచి కార్లలో దర్జాగా తరలివచ్చి పాల్గొన్నారు. జాతరలా సాగుతున్న ఈ కోడి పందేల వ్యవహారంపై కొంతమందికి అనుమానం వచ్చి పోలీసులకు సమాచారం అందించారు. దాంతో పోలీసులు దాడి చేయగా, ఈ వ్యవహారం వెలుగులోకి వచ్చింది. స్థానిక ఎస్ఐ రాజేశ్‌కుమార్ తన సిబ్బందితో కలిసి కోడి పందేల స్థావరంపై దాడి చేయగా, పందెం నిర్వాహకుల వద్ద నుంచి రూ.1,63,960 నగదును స్వాధీనం చేసుకోవడంతో పాటు రెండు ద్విచక్రవాహనాలు, మూడు పందెం కోళ్ల స్వాధీనం చేసుకొని ఏడుగురు వ్యక్తులను అరెస్ట్ చేసి మూడు కార్లు సీజ్ చేసిన సంగతి తెలిసిందే. ఈ ఘటన జరిగిన సందర్భంలో పందెంరాయుళ్లు కొందరు పరారయ్యారు.

అనుమతుల పేరుతో వసూళ్లు?

కన్నాయిగూడెం వద్ద జరిగిన కోడి పందేల నిర్వహణకు కొంతమంది అనుమతుల పేరుతో పందెం నిర్వాహకుడి వద్ద పెద్దస్థాయిలో డబ్బులు వసూలు చేసినట్లు ప్రచారం సాగుతోంది. ఒకే రోజు అనుమతి వచ్చిందంటూ.. అశ్వారావుపేట మండలానికి చెందిన ఓ వ్యక్తి ఏకంగా నిర్వాహకుల వద్ద రూ.1.50 లక్షల దాకా వసూలు చేసినట్లు, ఈ డబ్బులతో పోలీస్, మీడియా నుంచి ఎలాంటి ఇబ్బందులు రావని సదరు వ్యక్తి భరోసా ఇవ్వడంతో కోడి పందేలు నిర్వహించినట్లు పేరు చెప్పేందుకు ఇష్టపడని కొంతమంది గ్రామస్తులు చెబుతున్నారు.

నిర్వాహకుడి కోసం గాలింపు..

కోడి పందేలను నిర్వహించిన వ్యక్తి కోసం పోలీసులు గాలిస్తున్నారు. అనుమతుల పేరుతో కోడి పందేలను నిర్వహించిన అసలు సూత్రధారి కోసం పోలీసులు మూడు రోజులుగా విచారణ సాగిస్తున్నట్లు తెలిసింది. ఈ పందేల నిర్వహణ అంతా ఏపీలోని ఏలూరు జిల్లాకు చెందిన ఓ వ్యక్తి నడిపించగా, అతనికి అశ్వారావుపేట మండలానికి చెందిన కొంతమంది వ్యక్తులు సహకరించినట్లు తెలిసింది. సదరు నిర్వాహకుడు అనుమతుల కోసం పెద్దస్థాయిలో నగదు ఖర్చు పెట్టగా, ఈ డబ్బులు వసూలు చేసిన వ్యక్తుల గురించి కూడా పోలీసులు రహస్యంగా వివరాలు సేకరిస్తున్నారు. దీనిపై స్థానిక ఎస్ఐ బి.రాజేశ్‌కుమార్‌ను వివరణ కోరగా కోడి పందేల వ్యవహారంపై విచారణ సాగుతున్న మాట వాస్తవమేనన్నారు. పూర్తి వివరాలు ఇప్పుడే చెప్పలేమని పేర్కొన్నారు.

'గిరిజన బంధు' ప్రకటించాలి


అభివాదం చేస్తున్న నాయకులు

కారేపల్లి: సీఎం కేసీఆర్ అమలు చేస్తానన్న 'గిరిజనబంధు'ను వచ్చే అసెంబ్లీ సమావేశాల్లో ప్రకటించాలని గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రమావత్ శ్రీరాంనాయక్ డిమాండ్ చేశారు. ఆదివారం కారేపల్లి వైఎస్ఎన్ గార్డెన్స్‌లో గిరిజన సంఘం ఆధ్వర్యంలో ఉసిరికాయలపల్లి సర్పంచ్ బాణోతు బన్సీలాల్ అధ్యక్షతన ఆహ్వాన సంఘం సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కేంద్రంలో మోదీ ప్రభుత్వం కార్పొరేట్ వ్యవస్థలకు కొమ్ముకాస్తూ దేశ సంపదను దోచిపెడుతోందని విమర్శించారు. విభజన చట్టంలో భాగంగా ఏర్పాటు చేస్తానన్న గిరిజన యూనివర్సిటీ, బయ్యారం ఉక్కు పరిశ్రమలను ఏర్పాటు చేయడంలో కేంద్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. రాష్ట్రంలో గిరిజనులు పోరాడి సాధించుకున్న గిరిజన రిజర్వేషన్ జీఓ 33ను కేంద్ర ప్రభుత్వం చట్టభద్రత కల్పించి, 9వ షెడ్యూల్‌లో చేర్చాలని డిమాండ్ చేశారు. సమావేశంలో గిరిజన సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు భూక్యా వీరభద్రం, బాణోతు బాలాజీనాయక్, జిల్లా నాయకులు మూడ్ గన్యానాయక్, తేజావత్ కృష్ణకాంత్, అజ్మీర శోభన్‌నాయక్, భూక్యా లక్ష్మణ్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

కేసు నమోదు

కారేపల్లి: ఒక వ్యక్తిని నిర్బంధించి దాడి చేసిన వ్యక్తులపై ఆదివారం రాత్రి కేసు నమోదైంది. ఎస్ఐ రామారావు కథనం మేరకు.. బోటితండా గ్రామానికి చెందిన భూక్య వీరేందర్ చీమలపాడులో కూలి పనుల నిమిత్తం వెళ్లాడు. అయితే, కుటుంబ కలహాల నేపథ్యంలో వీరేందర్ భార్య.. చీమలపాడుకు చెందిన దివ్య, అత్త బుల్లితోపాటు మాలోత్ రాంకోటి, పంతులు, ప్రకాష్.. వీరేందర్‌ను చీమలపాడులో బంధించి దాడి చేశారు. దీంతో అదే రాత్రి ఇంటికి వచ్చిన వీరేందర్ మనస్తాపంతో పురుగులమందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. గమనించిన కుటుంబ సభ్యులు ఖమ్మం ఆస్పత్రికి తరలించి చికిత్స నిర్వహిస్తున్నారు. వీరేందర్ తల్లి భూక్య హస్యా ఇచ్చిన ఫిర్యాదు మేరకు కారేపల్లి ఎస్ఐ రామారావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వ్యక్తికి పాముకాటు

- అంబులెన్స్ లేక ట్రాక్టర్‌లో ఆస్పత్రికి తరలింపు


ట్రాక్టర్‌లో ఆస్పత్రికి తీసుకొస్తున్న దృశ్యం

గుండాల: ఒక్క ఫోన్ కాల్‌తో ప్రాణాలు కాపాడే అంబులెన్స్ నిత్యం మొరాయిస్తూ ఎక్కడ ఆగిపోతుందో తెలియని పరిస్థితుల్లో ఆదివారం ఓ వ్యక్తి పాముకాటుకు గురయ్యాడు. వెంటనే అంబులెన్స్‌కు ఫోన్ చేయగా మరమ్మతుల కోసం ఇల్లెందులో ఉందని సమాధానం రావడంతో ట్రాక్టర్‌లో గుండాల ఆస్పత్రికి తరలించారు. గుండాల పీహెచ్‌సీ పరిధిలో వైద్యసేవలు అందించే 108 వాహనం శనివారం మొరాయించగా ట్రాక్టర్ సాయంతో తాడు కట్టి ఆస్పత్రికి తరలించిన ఘటన విదితమే. అనంతరం తాత్కాలిక మరమ్మతులు చేశారు. అదేరోజు సాయంత్రం పురిటి నొప్పులతో బాధపడుతున్న మహిళను ఇల్లెందుకు తరలించారు. తిరుగు ప్రయాణంలో మళ్లీ మొరాయించడంతో ఆదివారం ఇల్లెందులోనే ఉంచారు. ఆదివారం ఉదయాన్నే మండలంలోని గణపురం గ్రామానికి చెందిన ఊకె బుచ్చయ్యకు పాము కాటు వేసింది. కుటుంబ సభ్యులు 108కు ఫోన్ చేయగా గుండాల 108 దెబ్బతిన్నదని, ఆళ్లపల్లి 108 వస్తోందని, క్షతగాత్రున్ని వెంటనే ఏదోరకంగా గుండాల ఆస్పత్రికి తరలించాలని సూచించగా వెంటనే ట్రాక్టర్‌లో బుచ్చయ్యను ఆస్పత్రికి తరలించారు. అప్పటికే పరిస్థితి చేయిదాటుతుండడంతో ఆళ్లపల్లి మండలానికి చెందిన 108 రావడంతో ఖమ్మం తరలించారు. ఆరోగ్య పరిస్థితి బాగానే ఉందని కుటుంబ సభ్యులు తెలిపారు. అయితే రోజూ ఇలా మొరాయిస్తున్న అంబులెన్స్ ఎందుకని మండల ప్రజలు వాపోతున్నారు.

పలు కేసుల్లో నిందితులు అరెస్ట్

కొత్తగూడెంఅర్బన్: చోరీలు, గంజాయి అక్రమ రవాణా కేసుల్లో నిందితులను ఆదివారం త్రీటౌన్ పోలీసులు పట్టుకున్నారు. వివరాలిలా ఉన్నాయి.. త్రీటౌన్ ఎస్ఐ సోమేశ్వర్ తన సిబ్బందితో కలిసి ఆదివారం రైతుబజార్ వద్ద వాహనాల తనిఖీ చేపట్టారు. భద్రాచలం వైపు నుంచి ఖమ్మం వైపు రెండు బైకులపై వస్తున్న నలుగురు వ్యక్తులు పోలీసులను చూసి పారిపోయేందుకు యత్నించారు. కానీ, పోలీసులు వారిని వెంబడించి పట్టుకున్నారు. వారి వద్ద నున్న బ్యాగులు తనిఖీ చేయగా అందులో మూడు కేజీల ఎండు గంజాయి (విలువ రూ.66 వేలు) మూడు పొట్లాలుగా ప్యాక్ చేసి సీలేరు నుంచి తీసుకొస్తున్నట్లు తేలింది. పట్టుబడిన నలుగురిలో జయశంకర్ జిల్లా కాటారం-ఇబ్రహీంపేట గ్రామస్తుడు ఐలాపురం రఘుపతి, ఖమ్మంలోని పాండురంగాపురానికి పొడకంటి హేమాన్స్‌జీవన్‌కుమార్, జయశంకర్ జిల్లా ఇబ్రహీంపేట గ్రామానికి చెందిన గంధం అనిల్ ఉన్నారు. వీరు ముగ్గురు ముఠాగా ఏర్పడి గతంలో ఖమ్మం, పెద్దపల్లి జిల్లాలో గంజాయితో పట్టుబడి జైలుకు వెళ్లి వచ్చారు. జైలు నుంచి వచ్చాక కూడా వారి ప్రవర్తన మార్చుకోకుండా మళ్లీ గంజాయి విక్రయించాలనే ఉద్దేశంతో కొత్తగూడెం లక్ష్మీదేవిపల్లి మండలంలోని శ్రీనగర్‌లో జీవన్‌కు చెందిన మరో ఇంట్లో ఉంటున్నారు. అదేకాలనీలో రాత్రిపూట తాళం వేసి ఉన్న ఇంట్లో దూరి బంగారు, వెండి నగలను చోరీ చేశారు. ఈ నెల 16న రాత్రి సారపాకలో ఇంటి ముందు పార్క్ చేసిన బైక్, 21న భద్రాచలంలో సీఆర్‌పీఎఫ్ క్యాంప్ దగ్గర బైక్‌ను అపహరించారు. అవే బైక్‌ల మీద సీలేరు వెళ్లి అక్కడ కరణం సాయి దగ్గర గంజాయి కొనుక్కొని తిరిగి బైక్‌లపై వస్తుండగా కొత్తగూడెంలో పట్టుబడ్డారు. వీరందరినీ వైద్య పరీక్షల అనంతరం కొత్తగూడెం కోర్టులో హాజరు పరిచినట్లు ఎస్ఐ వివరించారు.

క్లుప్తంగా...

నేడు, రేపు ఏపీ సీఎం వైఎస్ జగన్ ఢిల్లీ పర్యటన


- 'ఏపీ గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్'లో పాల్గొననున్న ఏపీ ముఖ్యమంత్రి



సాక్షి, అమరావతి: ఏపీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి 30, 31 తేదీల్లో ఢిల్లీలో పర్యటించనున్నారు. సోమవారం సాయంత్రం 4 గంటలకు తాడేపల్లి నివాసం నుంచి బయలుదేరి 6.45 గంటలకు ఢిల్లీ చేరుకుని 1 జన్‌పథ్ నివాసంలో రాత్రికి బసచేస్తారు. మంగళవారం ఉదయం 10.30 నుంచి 5.30 గంటల వరకు ఢిల్లీ లీలా ప్యాలెస్ హోటల్లో దౌత్యవేత్తలతో జరగనున్న ఏపీ గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్ రౌండ్ టేబుల్ సమావేశం-కర్టెన్‌రైజర్ కార్యక్రమంలో పాల్గొంటారు. కార్యక్రమం అనంతరం సాయంత్రం 6.05 గంటలకు ఢిల్లీ నుంచి బయలుదేరి రాత్రి 8.50 గంటలకు తాడేపల్లి నివాసానికి చేరుకుంటారు.

తీరంలో అలజడి

- నేడు వాయుగుండంగా మారనున్న తీవ్ర అల్పపీడనం



సాక్షి, విశాఖపట్నం/వాకాడు (తిరుపతి జిల్లా): తిరుపతి జిల్లా వాకాడు తీరంలో భీకర శబ్దాలతో అలలు ఉవ్వెత్తున ఎగసిపడుతున్నాయి. ఆగ్నేయ బంగాళాఖాతం, తూర్పు భూమధ్యరేఖ ప్రాంతం మీదుగా ఏర్పడిన తీవ్ర అల్పపీడనం కొనసాగుతోంది. దీనికి అనుబంధంగా ఉపరితల ఆవర్తనం మధ్య ట్రోపోస్ఫిరిక్ స్థాయి వరకు విస్తరించి ఉంది. తీవ్ర అల్పపీడనం పశ్చిమ వాయవ్య దిశగా కదులుతూ సోమవారం నాటికి వాయుగుండంగా బలపడనుంది. అనంతరం నైరుతి బంగాళాఖాతం మీదుగా నెమ్మదిగా పయనిస్తూ ఫిబ్రవరి 1 నాటికి శ్రీలంక తీరానికి చేరుకుంటుందని భారత వాతావరణ విభాగం (ఐఎండీ) ఆదివారం రాత్రి నివేదికలో తెలిపింది. దీని ప్రభావంతో సోమవారం నుంచి మూడు రోజుల పాటు దక్షిణ కోస్తాంధ్ర, రాయలసీమల్లో అక్కడక్కడా తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశాలు ఉన్నాయని వివరించింది. కాగా, బంగాళాఖాతంలో ఏర్పడిన తీవ్ర అల్పపీడన ప్రభావంతో ఆదివారం వాకాడు మండలం తూపిలిపాళెం సముద్ర తీరంలో ఈదురు గాలులు వీస్తుండగా.. సముద్ర కెరటాలు ఉవ్వెత్తున ఎగసి పడుతున్నాయి. దీంతో సముద్రం దాదాపు 5 మీటర్ల వరకు ముందుకు చొచ్చుకొచ్చి తీరాన్ని తాకుతోంది.

'గల్ఫ్' వలసలపై ఆరా!

బడ్జెట్‌కు ముందు సర్కారు కసరత్తు ● వివరాలు సేకరిస్తున్న ఇంటెలిజెన్స్ విభాగం



మోర్తాడ్ (బాల్కొండ): గల్ఫ్ దేశాలకు కార్మికుల వలసలపై రాష్ట్ర ఇంటెలిజెన్స్ విభాగం వివరాలు సేకరిస్తోంది. 2018 నుంచి ఇప్పటివరకు ఏ సంవత్సరం ఎంతమంది గల్ఫ్ దేశాలకు వలస వెళ్లారనే వివరాలపై ఆరా తీస్తున్నట్లు తెలుస్తోంది. త్వరలో రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలను నిర్వహించనున్న తరుణంలో ఈ ప్రక్రియ చేపట్టడం ప్రాధాన్యం సంతరించుకుంది. తెలంగాణలోని అన్ని జిల్లాల నుంచి గల్ఫ్ దేశాలకు వలసలు కొనసాగుతున్నాయి. ముఖ్యంగా ఉత్తర తెలంగాణ జిల్లాల నుంచి అధికంగా గల్ఫ్ దేశాలకు వలస వెళ్తున్నారు. ఉమ్మడి నిజామాబాద్, కరీంనగర్, ఆదిలాబాద్ జిల్లాలతో పాటు హైదరాబాద్‌లోని కొన్ని అసెంబ్లీ నియోజకవర్గాల్లో, పార్లమెంట్ స్థానాల్లో అభ్యర్థుల గెలుపు ఓటములపై గల్ఫ్ వలసలు ప్రభావం చూపే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని భావిస్తున్నారు. వలస కార్మికుల సంక్షేమానికి ఉమ్మడి రాష్ట్రంలో అప్పటి వైఎస్సార్ ప్రభుత్వం ప్రత్యేక పథకాలను అమలు చేసింది. ఆయన మరణం తర్వాత గల్ఫ్ వలస కార్మికుల గురించి పట్టించుకున్నవారు లేరని విమర్శలు ఉన్నాయి. తెలంగాణ ఉద్యమం సమయంలోనూ గల్ఫ్ వలస కార్మికుల అంశం ప్రత్యేకంగా చర్చకు వచ్చింది. ఉద్యమంలో కార్మికుల కుటుంబాలు చురుగ్గా పాల్గొన్నాయి. అయితే ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పడినా గల్ఫ్ వలస కార్మికులకు ఎలాంటి ప్రయోజనాలు చేకూరకపోవడంతో అసంతృప్తి వ్యక్తమవుతోంది. కేరళ తరహాలో ప్రవాసీ విధానాన్ని మన రాష్ట్రంలో అమలు చేయాలని లేదా గల్ఫ్ బోర్డును ఏర్పాటు చేయాలన్న డిమాండ్ మొదటి నుంచీ వినిపిస్తోంది. కాగా 2019 అక్టోబర్‌లో కూడా పంచాయతీ రాజ్ శాఖ ఇదే అంశంపై వివరాలను నమోదు చేసింది. కానీ అప్పట్లో ఆ ప్రక్రియ అర్ధాంతరంగా ఆగిపోయింది. త్వరలో రాష్ట్ర బడ్జెట్ ప్రవేశపెట్టనున్న తరుణంలో మరో సారి వలస కార్మికుల లెక్కల విషయంలో సర్కారు దృష్టి సారించడంపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ప్రభుత్వం వలస కార్మికుల వివరాలు సేకరిస్తున్న విషయం తమ దృష్టికి కూడా వచ్చిందని గల్ఫ్ వ్యవహారాల విశ్లేషకుడు మంద భీంరెడ్డి తెలిపారు. ప్రభుత్వం వద్ద కచ్చితమైన లెక్కలు ఉంటే వలస కార్మికులు, వారి కుటుంబాల సంక్షేమానికి చర్యలు తీసుకునే అవకాశం ఉంటుందని ఆయన అభిప్రాయపడ్డారు.

ఉమ్మడి జిల్లాల వారీగా వలస కార్మికుల వివరాలు.. (వలస కార్మికుల సంఘాల అంచనాల ప్రకారం)

జిల్లా పేరు	వలస కార్మికుల సంఖ్య
హైదరాబాద్	4,50,000
కరీంనగర్	3,10,000
నిజామాబాద్	2,90,000
ఆదిలాబాద్	1,85,000
మెదక్	1,00,000
వరంగల్	80,000
మహబూబ్‌నగర్	30,000
నల్లగొండ	25,000
ఖమ్మం	20,000
రంగారెడ్డి	20,000
మొత్తం	15,10,000





చెర్వుగట్టు ఆలయం వద్ద భక్తజన సందోహం. (ఇన్‌సెట్లో) కల్యాణతంతు జరిపిస్తున్న అర్చకులు →

కమనీయం.. రామలింగేశ్వరుడి కల్యాణం

- చెర్వుగట్టులో భక్తజన సందోహం

నార్కట్‌పల్లి: నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లి మండలం చెర్వుగట్టు గ్రామంలోని శ్రీ పార్వతీ జడల రామలింగేశ్వరస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం తెల్లవారు జామున కల్యాణోత్సవం వైభవంగా జరిగింది. ప్రధాన ఆలయం నుంచి స్వామి అమ్మవారిని నంది వాహనంపై మంగళవాయిద్యాలు, భజనల మధ్య కల్యాణ మండపం వద్దకు తీసుకొచ్చారు. వేద పండితులు అల్లవరపు సుబ్రహ్మణ్యశాస్త్రి, నీలకంఠశివాచార్య, ప్రధాన అర్చకుడు పోతులపాటి రామలింగేశ్వర శర్మ, సురేశ్‌శర్మ, శ్రీకాంత్‌శర్మ వేదమంత్రోచ్చరణల నడుమ కల్యాణ తంతు జరిపించారు. స్వామి వారికి కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి నూతన పట్టు వస్త్రాలు, తలంబ్రాలు సమర్పించారు. కల్యాణోత్సవంలో నకిరేకల్ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య పాల్గొన్నారు. జిల్లాతో పాటు ఇతర జిల్లాల నుంచి దాదాపు లక్ష మంది భక్తులు తరలివచ్చి కల్యాణాన్ని తిలకించారు.

వట్టి వసంతకుమార్ కన్నుమూత



భీమడోలు/ఆరిలోవ/ ఏయూ క్యాంపస్ (విశాఖ తూర్పు): ఉమ్మడి రాష్ట్ర మాజీ మంత్రి, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు వట్టి వసంతకుమార్ (70) ఆదివారం తెల్లవారుజామున కన్నుమూశారు. కొంతకాలంగా కిడ్నీ సమస్యతో బాధపడుతున్న ఆయన 4 రోజుల క్రితం విశాఖపట్నంలోని అపోలో ఆసుపత్రిలో చేరి, చికిత్స పొందుతూ మృతిచెందారు. ఆయనకు పిల్లలు లేరు. భార్య ఉమాదేవి నాలుగేళ్ల క్రితం అనారోగ్యంతో చనిపోయారు. ఆంధ్ర విశ్వవిద్యాలయంలో ఎంబీఏ, పీహెచ్‌డీ చేసిన వట్టి వసంతకుమార్ అదే విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేశారు. అనంతరం కాంగ్రెస్ పార్టీలో చేరారు. దివంగత సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి అనుచరుడు, సహచరుడిగా రాష్ట్ర రాజకీయాల్లో కీలక భూమిక పోషించారు. 2004, 2009 ఎన్నికల్లో ఉంగుటూరు ఎమ్మెల్యేగా గెలుపొందిన ఆయన వైఎస్ రాజశేఖరరెడ్డి, రోశయ్య, కిరణ్‌కుమార్ రెడ్డి కేబినెట్లలో మంత్రిగా పనిచేశారు. వైఎస్సార్ మృతి తర్వాత పరిణామాలకు కలతచెందిన ఆయన రాజకీయాలకు దూరంగా ఉంటున్నారు. కాగా వట్టి వసంతకుమార్ మృతి పట్ల ఏపీ గవర్నర్ విశ్వభూషణ్ హరిచందన్, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విచారం వ్యక్తం చేశారు.

'రాజకీయ స్వార్థం కోసమే బీఆర్‌ఎస్'



సాక్షి, హైదరాబాద్: రాజకీయ స్వార్థ ప్రయోజనాల కోసమే బీఆర్‌ఎస్ పార్టీ పని చేస్తుంది తప్ప.. ప్రజా ప్రయోజనాల కోసం కాదని టీటీడీపీ అధ్యక్షుడు కాసాని జ్ఞానేశ్వర్ అన్నారు. ఎన్టీఆర్ ట్రస్ట్ భవన్‌లో ఆదివారం వివిధ పార్టీలకు చెందిన పలువురు నాయకులు టీడీపీలో చేరిన సందర్భంగా ఆయన మాట్లాడారు. బీఆర్‌ఎస్ చెప్పేదొకటి.. చేసేది ఒకటిగా ఉందని విమర్శించారు.

తెలంగాణ తరహా పాలన కావాలంటున్నారు

- మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి
- మహారాష్ట్రలోని నాందేడ్‌లో బీఆర్‌ఎస్ సభ ఏర్పాట్ల పరిశీలన



నాందేడ్ జిల్లా కేంద్రంలో బీఆర్‌ఎస్ సభ ఏర్పాట్లను పరిశీలిస్తున్న మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి

బోధన్/నిర్మల్: మహారాష్ట్ర ప్రజలు తెలంగాణ తరహా సంక్షేమ పాలన కావాలని కోరుతున్నారని రాష్ట్ర అటవీ, దేవాదాయ శాఖ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి పేర్కొన్నారు. మహారాష్ట్రలోని నాందేడ్ జిల్లా కేంద్రంలో ఫిబ్రవరి 5న నిర్వహించే బీఆర్‌ఎస్ సభాస్థలిని ఆదివారం ఆయన పరిశీలించారు. జహీరాబాద్ ఎంపీ బీబీ పాటిల్, ప్రభుత్వ విప్ బాల్క సుమన్, బోధన్ ఎమ్మెల్యే మహ్మద్ షకీల్, టీఎస్ఐఐసీ చైర్మన్ గ్యాదరి బాల మల్లు, సివిల్ సప్లయ్స్ కార్పొరేషన్ చైర్మన్ సర్దార్ రవీందర్ సింగ్ ఆయన వెంట ఉన్నారు. సభాస్థలంలో వేదిక, పార్కింగ్ ప్రదేశాలు, బారికేడ్ల ఏర్పాటు పనుల ప్రగతిని మంత్రి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వివిధ రాష్ట్రాలకు చెందిన రాజకీయ ప్రముఖులు బీఆర్‌ఎస్‌తో కలసి పనిచేసేందుకు ముందుకు వస్తున్నారన్నారు. నాందేడ్ సభలో సీఎం కేసీఆర్‌తో పాటు పలువురు జాతీయ నాయకులు పాల్గొంటారని తెలిపారు. తెలంగాణలో అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలకు ఆకర్షితులై అనేక మంది బీఆర్‌ఎస్‌లో చేరేందుకు ఆసక్తి చూపుతున్నారన్నారు. నాందేడ్ సభలో కేసీఆర్ సమక్షంలో మహారాష్ట్రకు చెందిన పలువురు నాయకులు బీఆర్‌ఎస్‌లో చేరనున్నారని మంత్రి చెప్పారు. కాగా, నాందేడ్ జిల్లా కేంద్రంలోని గురుద్వారాను ఇంద్రకరణ్‌రెడ్డి, జోగు రామన్నలతో పాటు బీబీ పాటిల్, బాల్క సుమన్, మహ్మద్ షకీల్, రవీందర్ సింగ్ దర్శించుకుని ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

జిల్లా వార్తలు

వరల్డ్‌కప్‌లో 'భద్రాద్రి తేజం'

- ఫైనల్‌లో కీలక పాత్ర పోషించిన త్రిష
- భద్రాచలంలో క్రీడాకారుల సంబరాలు



గొంగడి త్రిష

భద్రాచలం: అండర్ -19 వరల్డ్ కప్‌లో తెలంగాణ తేజం, భద్రాచలానికి చెందిన గొంగడి త్రిష అద్భుత ప్రతిభ కనబర్చింది. బౌలింగ్‌లో, బ్యాటింగ్‌లో రాణించి వరల్డ్‌కప్ సాధనలో తనవంతు పాత్ర పోషించింది. ఆదివారం జరిగిన ఫైనల్స్‌లో ఇంగ్లండ్‌పై భారత జట్టు విజయభేరి మోగించి కప్ సొంతం చేసుకుంది. 68 పరుగులకే ఇంగ్లాడ్ జట్టును ఆలౌట్ చేసిన భారత్.. అనంతరం బ్యాటింగ్ చేపట్టగా త్రిష అద్భుత ఆటతీరును ప్రదర్శించింది. 24 పరుగుల వ్యక్తిగత స్కోర్‌ను సాధించి సౌమ్య తివారితో కీలక భాగస్వామ్యాన్ని నమోదు చేసి అండర్-19 వరల్డ్ కప్‌ను దేశానికి అందించింది. ఉమెన్ ఆఫ్ ద సీరీస్‌గా నిలిచిన ఇంగ్లండ్ కెప్టెన్‌ను క్యాచ్ ద్వారా ఔట్ చేసి మ్యాచ్‌ను మలుపుతిప్పింది. దీంతో త్రిష సొంతూరైన భద్రాచలంలో క్రీడాభిమానుల ఆనందానికి హద్దే లేదు. మ్యాచ్ ఆద్యంతం టీవీల్లో వీక్షించారు. గెలిచిన అనంతరం రోడ్లపైకి వచ్చి సంబరాలు జరిపారు. బాణాసంచా కాల్చుతూ జయహో భారత్ నినాదాలు చేశారు.

తొలి వరల్డ్‌కప్ టోర్నీలో 'మెరిసిన త్రిష'

భద్రాచలంలో జిమ్ నిర్వహించే గొంగడి రామిరెడ్డి కుమార్తె అయిన త్రిషను చిన్నతనం నుంచే క్రికెట్‌లో తీర్చిదిద్దారు. ఎనిమిదేళ్ల వయసులోనే జిల్లా స్థాయి క్రికెట్ పోటీల్లో రాణించి ఉమెన్ ఆఫ్ ద సిరీస్‌గా నిలిచింది. స్థానిక కళాశాల క్రీడా మైదానంలో త్రిషకు ఓనమాలు నేర్పిన రామిరెడ్డి, తన కూతురును అంతర్జాతీయ క్రీడాకారిణిగా తీర్చిదిద్దేందుకు హైదరాబాద్‌కు కుటుంబాన్ని తరలించి, త్రిషను ఆల్‌రౌండర్‌గా తీర్చిదిద్దారు. ఇటీవల అండర్-19 జట్టు తరఫున శ్రీలంక, వెస్టిండీస్, న్యూజిలాండ్ సిరీస్‌లలో రాణించటంతో అండర్-19 వరల్డ్ కప్ జట్టుకు త్రిషను ఎంపిక చేశారు. అండర్-19 వరల్డ్ కప్‌లో తొలిసారిగా ఎంపికవడంతో పాటు తొలి మ్యాచ్‌లోనే అద్భుతంగా ఆడి వరల్డ్‌కప్ సాధనకు దోహదం చేయడం విశేషం. స్కాట్లాండ్‌తో ఆడిన ఆటలో 51 బంతుల్లో 57 పరుగులు సాధించింది. భవిష్యత్‌లో మరింతగా రాణించాలని, త్రిషకు 'భద్రాద్రి రామయ్య' ఆశీస్సులు ఉండాలని ఈ ప్రాంత ప్రజలు ఆకాంక్షిస్తున్నారు.



ఆనందోత్సాహాల్లో క్రీడాభిమానులు

ప్రభుత్వ డెయిరీలో ప్రక్షాళన..

- అంతర్గత కుమ్ములాటలతో అధోగతి
- డీడీ, మరో నలుగురిపై కొరడా
- పాల సొసైటీల బలోపేతానికి చర్యలు



ఖమ్మం పాడి పరిశ్రమ యూనిట్

ఖమ్మంవ్యవసాయం: అవినీతి, అక్రమాల్లో కూరుకుపోయిన ఖమ్మం పాడి పరిశ్రమాభివృద్ధి సహకార సమాఖ్య (విజయ డెయిరీ) ప్రక్షాళనకు సంస్థ యాజమాన్యం నడుం బిగించింది. డెయిరీలో కొంతకాలంగా వెన్న, పాలు, పాల పదార్థాలు పక్కదారి పట్టిన వ్యవహారంపై రాష్ట్ర స్థాయి అధికారులు విచారణ జరుపుతూనే ఉన్నారు. ఓ ప్రత్యేకాధికారిని నియమించి ఎప్పటికప్పుడు నివేదికలు తెప్పించుకుంటున్నారు. ఈ క్రమంలో ఖమ్మం డెయిరీలో రూ.40 లక్షల మేర అక్రమాలు జరిగినట్లు గుర్తించి, బాధ్యులైన ఐదుగురిపై తాజాగా వేటు వేశారు. ప్రస్తుత డీడీ సత్యనారాయణను మాతృసంస్థ అయిన పశుసంవర్థక శాఖకు పంపించడంతో పాటు, మరో నలుగురిని సస్పెండ్ చేశారు. డీడీ స్థానంలో వరంగల్ పశుసంవర్థక శాఖ ఏడీ కుమారస్వామిని నియమించారు. రాష్ట్ర పాడి పరిశ్రమ సమాఖ్య ఎండీ ఆదేశాల మేరకు జనరల్ మేనేజర్ మల్లయ్య శని, ఆదివారాల్లో ఖమ్మంలోనే మకాం వేశారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ఉన్న వనరుల ఆధారంగా దాదాపు 50 వేల లీటర్ల సామర్థ్యం గల పాడి పరిశ్రమను ఖమ్మంలో ఏర్పాటు చేశారు. ఆరంభంలో ఈ పరిశ్రమకు మంచి ఆదరణ లభించినా.. ప్రైవేటు డెయిరీల రంగ ప్రవేశం, సంస్థ నిర్వహణ గాడి తప్పడంతో రైతుల నుంచి ఆదరణ కోల్పోతోంది. ఈ పరిశ్రమ పరిధిలో ఖమ్మం, భద్రాద్రి జిల్లాల్లో 10 బల్క్‌మిల్క్ సెంటర్లు, 200 పైగా పాల సేకరణ కేంద్రాలు ఉన్నాయి. పరిశ్రమ రెండు జిల్లాల్లో విస్తరించినప్పటికీ నిర్వహణ లోపాలతో ఆశించిన ఫలితాలు రావడం లేదు. సాధారణంగా పాల సీజన్ అయిన అక్టోబర్ – మార్చి మధ్య నిత్యం 25వేల లీటర్ల పాలను సేకరించే సంస్థ.. కొన్నేళ్లుగా రోజుకు 14 నుంచి 18 వేల లీటర్లకు మించి సేకరించడం లేదు. ఈ ఏడాది అక్టోబర్ నుంచి డిసెంబర్ వరకు రోజుకు 18 వేల లీటర్ల చొప్పున సేకరించగా, జనవరిలో 14 వేల లీటర్లకు పడిపోయింది. ప్రభుత్వం అనేక ప్రోత్సాహకాలు ఇస్తున్నా ఆశించిన స్థాయిలో రైతులు ఆదరించడం లేదు. సంస్థ నిర్వహణ లోపాలు, అవినీతి, అధికారులు, ఉద్యోగులు, సహకార సంఘాలు, రైతుల మధ్య అంతర్గత విభేదాలు తదితర కారణాలతో డెయిరీ అప్రతిష్ట పాలవుతోంది.

వెల్లువెత్తిన ఫిర్యాదులు..

ఖమ్మం డెయిరీలో రెండేళ్లుగా అంతర్గత కుమ్ములాటలు పెరిగాయి. ఉన్నతాధికారుల మధ్య సమన్వయం లేకపోవటం, కొందరు అధికారులు పాల పదార్థాల రవాణాలో అక్రమాలకు పాల్పడడం, అవినీతి పెచ్చరిల్లడంతో పరిశ్రమ నిర్వహణ పక్కదారి పట్టింది. అక్రమాలకు అడ్డొచ్చిన కిందిస్థాయి ఉద్యోగులను ఇతర ప్రాంతాలకు బదిలీలు చేయడంతో ఈ కుమ్ములాటలు మరింతగా పెరిగాయి. రూ.లక్షల విలువైన పాల పదార్థాలు పక్కదారి పట్టడంపై రాష్ట్ర ఉన్నతాధికారులకు, కలెక్టర్‌కు కొందరు ఫిర్యాదు చేశారు. పాడి పశువుల కొనుగోళ్లలో అన్యాయం జరిగిందని, బీమా సక్రమంగా చెల్లించక నష్టపోయామని కొందరు రైతులు ఆందోళనలు కూడా చేశారు. ఈ క్రమంలో ఏడాది క్రితం కొందరిని ఇక్కడి నుంచి బదిలీ చేసి, డీడీగా సత్యనారాయణను నియమించారు. అయినా పరిస్థితి మారకపోవడంతో మరోసారి చర్యలకు రాష్ట్ర సంస్థ పూనుకుంది.

డీడీతో పాటు నలుగురిపై వేటు..

డెయిరీలో అవినీతి, అక్రమాలపై రాష్ట్ర సంస్థ విచారణ చేపట్టి బాధ్యులైన ఐదుగురిపై వేటు వేసింది. డీడీ సత్యనారాయణను పశుసంవర్థక శాఖ(నల్గొండ)కు పంపించారు. ఇక్కడ మేనేజర్‌గా పనిచేసి పలు ఆరోపణలపై నల్లగొండకు బదిలీ అయిన నరేష్, ప్రస్తుత మేనేజర్ భరతలక్ష్మితో పాటు ప్లాంట్ ఆపరేటర్ మణి, ల్యాబ్ అసిస్టెంట్ నాగశ్రీని సస్పెండ్ చేశారు. ఈ మేరకు రాష్ట్ర ఎండీ జనరల్ మేనేజర్ మల్లయ్య ద్వారా ఆయా అధికారులు, ఉద్యోగులకు ఉత్తర్వులు అందజేయించారు. కాగా, మిగిలిన ఉద్యోగులతో అధికారులు ఆదివారం సమావేశం నిర్వహించి పరిశ్రమ నిర్వహణపై దిశానిర్దేశం చేసినట్లు సమాచారం.

నూతన యంత్రాంగం నియామకానికి చర్యలు..

ఖమ్మం పాడి పరిశ్రమలో అవినీతి అక్రమాలను అధిగమించేందుకు నూతన యంత్రాంగాన్ని నియమించేలా ఉన్నతాధికారులు కసరత్తు చేస్తున్నారు. పాల సేకరణ పెంచడంతో పాటు అవినీతి అక్రమాలకు చెక్ పెట్టేలా తగిన కార్యాచరణ రూపొందించాలని సంస్థ నిర్ణయించింది. ఇక పాల సొసైటీల బలోపేతానికి సైతం చర్యలు చేపట్టాలనే యోచనలో సంస్థ యాజమాన్యం ఉంది.

నాణ్యతా ప్రమాణాలు మెరుగుపర్చుతాం

ఖమ్మం పాడి పరిశ్రమ అభివృద్ధికి రాష్ట్ర సంస్థ తగిన చర్యలు తీసుకుంటుంది. డెయిరీ నిర్వహణలో చోటుచేసుకున్న అక్రమాలు అనేవి సంస్థ అంతర్గత అంశాలు. నిర్వహణలో తలెత్తిన సమస్యలను అధిగమించేందుకు చర్యలు తీసుకుంటున్నాం. ఖమ్మం పరిశ్రమలో నిర్వహణ, ఇతర అంశాల్లో నాణ్యతను పెంచేందుకు కృషి చేస్తున్నాం. సంస్థ నిర్వహణకు అవసరమైన సాంకేతిక అధికారులను నియమిస్తున్నాం. అధికారులు, ఉద్యోగుల మధ్య సమన్వయం ఉండేలా చర్యలు తీసుకుంటాం. –మల్లయ్య, జీఎం

కోలాహలంగా జాతీయస్థాయి కరాటే పోటీలు

ఖమ్మం స్పోర్ట్స్: నగరంలోని వర్తక సంఘం భవనంలో ఆదివారం నిర్వహించిన జాతీయ స్థాయి కరాటే అండ్ కుంగ్‌ఫూ పోటీలతో సర్వత్రా సందడిగా మారింది. హోంగార్డు ఆర్ఐ శ్రీశైలం, ఎక్సైజ్ సీఐ సర్వేశ్వర్‌రావు, టోర్నీ చీఫ్ ఆర్గనైజర్ గోపతి సైదులు పోటీలను ప్రారంభించగా, వివిధ ప్రాంతాల నుంచి 600 మంది విద్యార్థులు హాజరయ్యారు. రాత్రి జరిగిన బహుమతి ప్రదానోత్సవ కార్యక్రమంలో ఖమ్మం త్రీటౌన్ సీఐ పంజాల సర్వయ్య, చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు చిన్ని కృష్ణారావు, కార్యదర్శి మెంతుల శ్రీశైలం, ఉపాధ్యక్షుడు సోమ నర్సింహారావు(జీవై నరేష్) పాల్గొన్నారు. గ్రాండ్ చాంపియన్‌గా నిలిచిన వారికి ప్రత్యేక ట్రోఫీలు అందజేశారు.



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న అతిథులు (ఇన్‌సెట్) పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

నేడు సింగరేణి డైరెక్టర్ల ఎంపిక

- ప్రధానంగా పోటీలో ముగ్గురు జీఎంలు
- హైదరాబాద్ సింగరేణిభవన్‌లో నేడు ఇంటర్వ్యూలు



హైదరాబాద్‌లోని సింగరేణి భవన్

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి డైరెక్టర్ పోస్టుల నియామకం నేటితో తేలిపోనుంది. సోమవారం హైదరాబాద్‌లోని సింగరేణి భవన్‌లో ఇంటర్వ్యూలు నిర్వహించి, అర్హులను ఎంపిక చేయనున్నారు. జీఎంస్థాయి విధుల్లో వారి నైపుణ్యం, అంకితభావం, సంస్థ అభివృద్ధికి వారి చేసిన కృషి తదితర అంశాలను పరిగణనలోకి తీసుకుంటారని అధికార వర్గాలు పేర్కొంటున్నాయి. సింగరేణి ఆపరేషన్స్ డైరెక్టర్ పి.చంద్రశేఖర్ ఈ నెల 31న పదవీ విరమణ పొందనున్నారు. ఇప్పటివరకు ఆయన ఆపరేషన్స్‌తోపాటు ప్రాజెక్ట్స్ అండ్ ప్లానింగ్, పర్సనల్ వెల్ఫేర్ అండ్ అడ్మినిస్ట్రేటివ్ డైరెక్టర్‌గా ఇన్‌చార్జ్ బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. నేడు జరిగే ఇంటర్వ్యూలో సంస్థలోని సీనియర్, సమర్థవంతమైన జీఎంలను ఆపరేషన్స్, ప్రాజెక్ట్ డైరెక్టర్లుగా ఎంపిక చేయనున్నారు.

బరిలో 10 మంది

రెండు డైరెక్టర్ పోస్టులకు ఇంటర్వ్యూలు నిర్వహించనుండగా, 10 మంది అభ్యర్థులు బరిలో ఉన్నారు. కార్పొరేట్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ జీఎం ఎస్‌డీఎం సుభాని, మణుగూరు జీఎం జి.వెంకటేశ్వరరెడ్డి, కాంట్రాక్ట్ మేనేజ్‌మెంట్ కమిటీ జీఎం దుర్గం రాంచందర్, క్వాలిటీ జీఎం సయ్యద్ హబీబ్ హుస్సేన్, కార్పొరేట్ క్వాలిటీ జీఎం ఐనాల రవికుమార్, అడ్రియాల లాంగ్‌వాల్ ప్రాజెక్ట్ జీఎం ఎస్‌వీకె. శ్రీను, పర్చేజ్ జీఎం సుబ్బారావు, ఎస్టేట్స్ జీఎం డీఆర్ రవి ప్రసాద్, ఆర్జీ-2 ఏరియా జీఎం ఏ. మనోహర్, మందమర్రి ఏరియా జీఎం చింతల శ్రీనివాస్ డైరెక్టర్ పోస్టుల కోసం పోటీ పడుతున్నారు. కాగా బరిలో 10 మంది ఉన్నప్పటికీ ప్రధానంగా పోటీలో ముగ్గురే ఉన్నట్లు తెలుస్తోంది. జి.వెంకటేశ్వరరెడ్డి, దుర్గం రాంచందర్, ఎస్‌వీకే శ్రీను మధ్య ప్రధానంగా పోటీ ఉన్నట్లు విశ్వసనీయ సమాచారం. వారి బయోడేటా, స్టేటస్, పెర్ఫార్మెన్స్ వివరాలను సింగరేణి భవన్ ఉన్నతాధికారులు ఇటీవలే తీసుకున్నట్లు తెలిసింది. వారిలో ఇద్దరు మైనింగ్ గ్రాడ్యుయేట్లు కాగా, ఒకరు మాత్రం మైనింగ్ డిప్లొమా అభ్యర్థి అని సమాచారం. ఆ ముగ్గురిలో ఒకరిని ఆపరేషన్స్, మరొకరిని ప్రాజెక్ట్స్ అండ్ ప్లానింగ్ డైరెక్టర్‌గా ఎంపిక చేస్తారు.

వైభవంగా దివ్యోత్సవం



మాట్లాడుతున్న మాజీ ఎంపీ పొంగులేటి



కాళ్లు లేకున్నా అద్భుత ప్రదర్శన ఇస్తున్న పాషా

- ఆడి, పాడిన దివ్యాంగ కళాకారులు

సూపర్‌బజార్(కొత్తగూడెం): తెలంగాణ విభిన్న ప్రతిభావంతుల సంఘం(టీవీపీఎస్) ఆధ్వర్యంలో కొత్తగూడెం క్లబ్‌లో ఆదివారం దివ్యాంగుల ఆత్మీయ సమ్మేళనం(దివ్యోత్సవం) వైభవంగా నిర్వహించారు. దేశభక్తియుత సాంస్కృతిక కార్యక్రమాల ప్రదర్శనలో తాము తక్కువ కాదని దివ్యాంగులు నిరూపించారు. ఈ వేదికపై సకలాంగుడైన వరుడు నరసింహారావుకు, దివ్యాంగురాలైన వధువు దీవెనతో వివాహం జరిపించారు. కొత్తగూడెం ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు, మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి వధూవరులను ఆశీర్వదించారు. ఈ సందర్భంగా పొంగులేటి వధూవరులకు రూ. 5వేలతో పాటు దుస్తులు అందించారు. దివ్యోత్సవ కార్యక్రమానికి మరో రూ.25 వేలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దివ్యాంగులకు మరిన్ని సౌకర్యాలు కల్పించాల్సిన అవసరం ఉందని అన్నారు. అనేక సమస్యలతో బాధపడుతున్న దివ్యాంగులను ఆదుకోవాలన్నారు. దివ్యాంగుల కష్టాలలో అండగా ఉంటానని హామీ ఇచ్చారు. టీపీసీసీ సభ్యులు నాగా సీతారాములు కార్యక్రమానికి హాజరై వధూవరులను ఆశీర్వదించడంతో పాటు తన పుట్టిన రోజు వేడుకను ఈ వేదికపైనే జరుపుకున్నారు. ఈ సందర్భంగా నిర్వాహకులకు, వధూవరులకు ప్రత్యేక బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ కాపు సీతాలక్ష్మి, ఎంపీపీ బాదావత్ శాంతి, ఎంపీటీసీ భద్రమ్మ, ఉపసర్పంచ్ లగడపాటి రమేష్, నాగమణి, నాగరాజు, ప్రమీల దంపతులు, మొక్కల వెంకటయ్య, న్యాయవాది అరికల రవికుమార్, చదలవాడ ప్రకాష్, టీయూడబ్ల్యూజే జిల్లా అధ్యక్షుడు కళ్లోజి శ్రీనివాస్, షేక్ దస్తగిరి, మేడి ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.